# పంజరంలో పక్షులు

డా.కొఠారి వాణీ చలపతిరావు




'ఒక్కొక్కసారి ఎందుకిలా అవుతుంది? మనం ఏదేదో అనుకుంటాం కానీ మరేదేదో అవుతుంటుంది. ఎన్నో ఆశిస్తాం. కానీ అందులో కొన్నయినా నెరవేరక పోగా..ఊహించని విధంగా సీన్ మొత్తం రివర్స్ అవుతుంది' దేవిక మనసు నిండా ఈమధ్య ఇవే ఆలోచనలు. దిగులుతో రోజుకు కొంచెం కొంచెంగా కుంచించుకుని పోతున్నది తను! అనుకోకుండా తన పిల్లల్లో వచ్చిన మార్పు ఆమెను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

చిన్న చిన్న సమస్యలే కదా అనుకుంటాంగానీ..అవే పైకి కనబడకుండా లోనుంచి మనుషుల్ని కొంచెం కొంచెంగా తినేస్తూ ఉంటాయి. అవి అనుకోకుండా వచ్చినవీ..కొన్నేళ్ల ఆశలమీద చన్నీళ్లు చల్లేవీ అయితే ఇక ఆ బాధ మాటల్లో చెప్పలేనిదిగా ఉంటుంది.

తమ ఇద్దరు పిల్లలు కిన్నెర, కిరీటిలను అల్లారుముద్దుగా పెంచారు దేవిక, భర్త భరద్వాజ. దేనికీ లోటు రానివ్వలేదు. అడక్కుండానే అన్నీ కొనిచ్చారు. అలా అని అతిగారాబం చేయకుండా క్రమశిక్షణ నేర్పారు. వాళ్ల సుఖం కోసం, సంతోషం కోసం, అభివృద్ధికోసం తమ సుఖసంతోషాలను త్యాగం చేసారు. ప్రతి నిముషం..ప్రతి రోజూ పిల్లల భవిష్యత్తే ధ్యాసగా వాళ్లగురించే ఆలోచించారు. వాళ్ల గురించే శ్రమించారు. తండ్రి భరద్వాజకన్నా ఈ విషయంలో తల్లి దేవిక శ్రమ, పట్టుదలలే ఎక్కువని చెప్పక తప్పదు. ఉదయం ఐదు గంటలకే పిల్లల్ని పక్కమీద నుంచి లేపి, పుస్తకాలు ముందుపెట్టి చదవమనేది. సాయంత్రం సమయంలో పిల్లలతోపాటు తనూ కూర్చుని హోంవర్క్ చేయించడం, పాఠాలు చెప్పడం, పరీక్షలకు ప్రిపేర్ చేయడం చేసేది. చదువు ఒక్కటే ఉంటే సరిపోదని కిన్నెరకు సంగీతం, కిరీటికి గిటార్‌లో శిక్షణ ఇప్పించింది.

ఎన్ని ఉన్నా సంస్కారం ఉండకపోతే వృధా అని మంచీ చెడూ..మాటా మన్ననా వంటి వ్యక్తిత్వ వికాసపు కోచింగ్‌ను ఇంట్లోనే స్వయంగా ఇచ్చింది. దాదాపు పదిహేను, ఇరవై సంవత్సరాలుగా ఇంత చేస్తూ వచ్చి ఎంతగానో కష్టపడి 'పిల్లలు పర్‌ఫెక్ట్‌గా తయారయ్యారు. శ్రమ ఫలించింది. ఇంక కాస్త విశ్రాంతి తీసుకోవచ్చు' అనుకుంటున్న సమయంలో ఓరోజు అనుకోకుండా పిల్లల గురించిన ఓ ఆశ్చర్యకరమైన నిజం బయటపడి అదిరిపడింది దేవిక. అనుమానం వచ్చి నిఘావేసి తరచి తరిచీ చూస్తే రోజుకొక్కకటిగా అలాంటివే మరెన్నో నిజాలు! తల తిరిగిపోయింది దేవికకు.

బుద్ధిమంతురాలు అనుకున్న కిన్నెర అబద్ధాలాడుతున్నదని..కాలేజీకని చెప్పి స్నేహితులతో సినిమాలకు, షికార్లకు వెళుతున్నదని...కిరీటి తండ్రి పర్స్‌లోనుంచి అడపాదడపా డబ్బు కొట్టేస్తున్నాడనీ తెల్సి..'ఇన్నేళ్ల నా పెంపకానికి ఇదా ఫలితం? ఎంత శ్రద్ధగా, జాగ్రత్తగా పెంచాను' అనుకుంటుంటే ఆమె కన్నీళ్లు ఉబికి పైకి వచ్చాయి.

పిల్లలు...ఈ రోజుల్లో ఎందుకిలా తయారవుతున్నారు? 'తల్లిదండ్రులు ఎంత మంచిగా పెంచినా బయటి వ్యవస్థ ప్రభావం వాళ్లమీద పడి పాడైపోతున్నారనీ..పక్క దోవలు తొక్కుతున్నారనీ' తెలిసి స్వయంగా అలాంటివాళ్లను చూసి తన పిల్లల విషయంలో అలా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంది. ఇంట్లో టీవీ పెట్టడం మానేసింది. సెల్‌ఫోన్లు కొనివ్వలేదు. పిల్లల్ని ఇల్లు, కాలేజీ తప్ప బయట ఎక్కువగా తిరగకుండా కంట్రోల్‌లో ఉంచింది.

ఆడపిల్ల డ్రస్సింగ్ విషయంలో సంస్కృతి, సంప్రదాయాలను పాటించడం విషయంలో, భవిష్యత్తును బుగ్గి చేసే అపరిపక్వప్రేమలు..ఆవేశాలతో కూడిన అనర్థాలకు ముందుగానే చెక్ చెప్పడం కోసం కిన్నెరకు ప్రతి రోజూ ఎన్ని నీతులు చెప్పింది. ఎంతగా హితబోధ చేసింది! అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్టుగా లోక రీతిని విప్పిచెప్పింది.

కిరీటి విషయంలో మాత్రం తక్కువ చేసిందా తను!?

నూనూగు మీసాలయినా రాకముందే సిగరెట్లకు, తాగుడుకు అలవాటు పడుతున్న కుర్రకారును చూసి తన కొడుకూ అలాగే తయారవుతాడనే భయంతో వాడి కదలికలను, చర్యలను ఎప్పటికప్పుడు నియంత్రిస్తూ వచ్చింది. అయినా ఎందుకిలా జరుగుతున్నది. డబ్బుతో వాడికి అంతగా ఏం అవసరాలు ఉన్నాయని ఇంట్లో డబ్బులు కొట్టేస్తున్నాడు? ఛీ ఛీ వీళ్లు నా పిల్లలని చెప్పుకోవటానికే సిగ్గుగా ఉంది. ఇంటి పరువు తీస్తున్నారు. ఎవరికన్నా తెలిస్తే ఎంత సిగ్గు చేటు అని దేవిక మనస్తాపం చెబుతుండగా కాలింగ్ బెల్ శబ్దమయింది.

తలుపుతీస్తే ఎదురుగా చెల్లెలు గీతిక!

"నువ్వా! రా రా!" అంది దేవిక సంభ్రమాశ్చర్యాలతో.

మనసు బాగోలేని సమయంలో తలవని తలంపుగా దొరికిన ఆ తోబుట్టువుతోడు మనసును తేలికపరిచినట్లయింది.

అంతా బాగున్నప్పుడు ఒంటరిగానే అయినా హాయిగా బతికేయవచ్చేమోగానీ చికాకుల్లో, సమస్యలో మాత్రం అది సాధ్యం కాదు. తన బాధను పంచుకోవటానికి పరిష్కారం చెప్పటానికి మరో మనిషి తోడు ఉంటే బాగని అనిపిస్తుంది.

అందుకే చెల్లెలు గీతిక కనిపించగానే దేవికకు పోతున్న ప్రాణం తిరిగి వచ్చి శరీరంలో ప్రవేశించినట్టయింది.

"ఏం చేస్తున్నావక్కా?" అంది గీతిక అక్క ముఖం వంక పరిశీలనగా చూస్తూ.

"ఏం చేయడం లేదుగానీ..నువ్వేమిటి 'వస్తున్నానని' ఫోన్ అయినా చేయకుండా అకస్మాత్తుగా ఊడిపడ్డావ్?" అంది దేవిక.

"మా ఆయన అనుకోకుండా ఊరికెళ్లారు నిన్న! మళ్లీ ఈరోజు రాత్రికి కానీ రారు. ఈ రోజంతా నీతో కాలక్షేపం చేద్దామని వచ్చాను. 'ఇల్లే కైలాసం!' అనుకుంటూ బతికే మనిషివి గనుక మీ తలుపునకు ఎప్పుడూ తాళం ఉండదు. అందుకే ఫోన్ చేయకుండా సర్ప్రయిజ్ చేద్దామని వచ్చాను"

"మంచి పనిచేసావ్! ఈరోజు నువ్వు రావడం నాకు చాలా రిలీఫ్‌గా అనిపిస్తున్నది"

"నిన్ను చూడగానే కనిపెట్టానులే. ఈరోజు నీ మనసు బాగోలేదని..ఏదో విషయంలో సీరియస్‌గా ఆలోచిస్తున్నావని! అలాంటప్పుడు బావగార్ని ఆఫీసుకు శెలవుపెట్టి ఇంట్లో ఉండమనాల్సింది" అంది గీతిక.

"ఆ అదృష్టం నాకుండే ఇంక లేనిదేముంది. మనసులో మాట ఏదయినా విప్పి చెప్పుకోవటానికి..బాధలో భాగం పంచుకోవటానికి ఆయన సహకారం నాకు ఎప్పుడూ లేదు. ఆయన స్వభావం నీకు తెలుసుగా. కోపం, ఆవేశం ఎక్కువ. సమయానుకూలంగా సహనంతో ఆలోచన చేయడం..మంచి చెడులు విశ్లేషించి పరిష్కారం నిర్ణయించడం ఆయనకు చేత కాదు. పైగా తొందరపాటుతనం, ఉద్రేకంతో సమస్యను మరింత జటిలం చేస్తారు. అందుకే ఏదీ ఆయనతో చెప్పను నాలో నేనే బాధపడటం తప్ప" అంది దేవిక నిట్టూరుస్తూ.

"ఇప్పుడు అంత బాధ ఏమొచ్చింది అక్కా! తోడబు

ట్టినదానిని నాతో కూడా చెప్పగూడదనిదా?" అంది గీతిక.

తన మనస్తాపంలో పాలు పంచుకుంటానంటున్న చెల్లెలి మాటలకు కాస్త ఊరట చెందింది దేవిక.


"పిల్లల్ని నేనూ, మీ బావ ఎంత జాగ్రత్తగా..శ్రద్ధగా కష్టపడి పెంచి పెద్ద చేసామో నువ్వూ చూస్తూనే ఉన్నావు కదా గీతికా! వాళ్లమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. గొప్పవాళ్లుగానే గాక మంచి మనుషులుగా ఎదుగుతారని ఆశపడ్డాం. కానీ నమ్మశ్యంగానట్లుగా కిన్నెర నాతో అబద్ధాలాడుతూ చాటుమాటు తిరుగుళ్లు తిరుగుతోంది. కిరీటీ అంతే..మా కళ్లు గప్పి ఇంట్లో డబ్బు కొట్టేస్తున్నాడు. ఏం చేస్తున్నాడో. దారితప్పి ఏ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడో తెలియదు" అంది దేవిక.

ఆ మాటలకు నిశ్చేష్టురాలైంది గీతిక. తన చెవులను తను నమ్మలేనంతగా ఆశ్చర్యపోయింది. ఎందుకంటే అక్క పిల్లలిద్దరూ మాటతీరులో, మంచితనంలో, పెద్దవాళ్లను మన్నించడంలో బుద్ధిమంతులుగానే ఇన్నేళ్ళూ తనూ చూస్తూ వస్తున్నది. ఇప్పుడు అక్క చెపుతున్న ఈ కొత్త విషయం..అందుకే ఆమెకు జీర్ణం కావడం లేదు. అలా అని అక్క తన పిల్లల గురించిన అసలు నిజం కనిపెట్టకుండా ఇలా ఎలా మాట్లాడుతుంది? అన్న ఆలోచన రాగానే అక్క దేవికకు ఊరట చెప్పే ఉద్దేశంతో- "వాళ్లు అలాంటి వాళ్లు కాదు అక్కా! నువ్వు పొరబాటు పడుతున్నావేమో" అంది.

"లేదు! నేను ధృవపరచుకున్నాకే చెబుతున్నాను. అందులో సందేహం లేదు. ఇప్పుడు నాకు కావాల్సిన సలహా అల్లా వాళ్ల విషయం నాకు తెలిసిపోయిందని వాళ్లకు తెల్సేలా నన్ను ఏం చేయమంటావో చెప్పు! నిలదీసి అడగటం ఒక్కటే మార్గంగా నాకు అనిపిస్తున్నది. అప్పుడయినా సిగ్గుతో తలవంచుకుని తప్పు ఒప్పుకుని..ఆ దురలవాట్లు మానుకునే ప్రయత్నం చేస్తారేమో" అంది దేవిక ఆగ్రహావేశాలతో.

"అలా వద్దు..అలా వద్దు" అంది గీతిక కంగారుపడుతూ.

"పిల్లల మనసులు గాజుపాత్రల లాంటివి. జాగ్రత్తగా హ్యాండిల్ చెయ్యక



పోతే చేయిజారి కిందపడి బద్దలైపోతాయి. అందులోనూ ఈ కాలం పిల్లలు చాలా సెన్సిటివ్. వెనకటి కాలంలోలా తిట్టి, కొట్టి పరుషంగా చెబితే అస్సలు వినకపోగా మరింత మొండికేస్తారు. అమ్మా నాన్న తిట్టారని ఇంట్లోనుంచి పారిపోవటం, ఆత్మహత్యలు చేసుకోవడం ఎన్ని చూడటం లేదు మనం పేపర్లో టీవీ ఛానళ్లలో" అంది.

"మరి ఏం చేయమంటావే నన్ను?" నిస్సహాయంగా, నిస్సత్తువగా అంది దేవిక.

"నువ్వు ఆందోళన పడకు. నేను చెబుతాగా! బావగారికి తెలియకుండా నేర్పుగా మనం ఈ సమస్యను పరిష్కరిద్దాం. ఇప్పుడు కొత్తకొత్త సమస్యలు పుడుతూ వస్తున్నట్టే, వాటికి పరిష్కార మార్గాలు కూడా కొత్తరకంవే వస్తున్నాయి. కర్రవిరగకూడదు...పాము చావకూడదు అన్నట్టుగా నొప్పించకుండా..తానొవ్వకుండా తేలికగా డెలికేట్‌గా సమస్యకు పరిష్కారాన్ని సాధించి పెట్టడానికి కౌన్సిలింగ్ సెంటర్లు వీధివీధినా వెలిసాయి. మా ఇంటిపక్కన ఉండే భార్యాభర్తలు ఒకరు..ఏం సమస్యలో ఏంటో తెలియదుగానీ ఎప్పుడూ ఏదో చికాకులతో, అసంతృప్తులతో కీచులాడుకుంటూ ఎడముఖం పెడముఖంగా ఉండే వాళ్లు. కొన్నాళ్ల తర్వాత వాళ్లు ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను సంప్రదించారని తెల్సింది. అక్కడ ఏం ట్రీట్‌మెంట్ ఇచ్చారో తెలియదు...ఇప్పుడు ఇద్దరూ హాయిగా, ఆనందంగా, ప్రేమగా ఉంటున్నారు!" అని చెప్పింది గీతిక.

"అవునా! మనమూ వెళ్దామా! తేలికగా ఈ సమస్య పరిష్కారమైతే అంతకన్నా కావల్సింది ఏముంది?" అంది దేవిక ఆశగా.

★ ★ ★

ఆ రోజే అక్కచెల్లెల్లిద్దరూ కలిసి ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌కు వెళ్లారు.

అక్కడ కౌన్సిలర్ ఆనందమూర్తి చిరునవ్వుతో ఆహ్వానించాడు. ఎంతో సింపుల్‌గా, అతిసాధారణంగా ఉన్న ఆయనను చూసి 'ఈయన సమస్యలను పరిష్కరించటం ఏమిటి?' అనుకుంది దేవిక ఆశ్చర్యంగా.


అంతా విని ఓస్! ఇంతేనా..ఇదొక సమస్యే కాదన్నట్లుగా తేలికగా తీసిపారేశాడు ఆయన ఒక్క చిరునవ్వుతో. అది మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది దేవికకు. కొన్ని నెలలుగా ఎంతో మానసిక సంఘర్షణ అనుభవిస్తూ, తీవ్ర ఒత్తిడికి తనను గురిచేసిన అంత పెద్ద సమస్యను..చిటికెలో చిన్నది చేసిన ఆయన తీరు ఎంత

ఆలోచించినా అర్థం కాలేదు ఆమెకు.

అదే మాటను రహస్యంగా చెల్లితో అంటే "వాళ్లం తేలే! మనలాగా ప్రతి చిన్న విషయాన్నీ వాళ్లు భూతద్దంలో చూడరు. పెద్ద సమస్యలను కూడా చిన్నవిగా లైట్ తీసుకోగలిగితేనే వాళ్లు ట్రీట్‌మెంట్ చెయ్యగలరు!" అంది.

తను అన్నట్లుగానే కౌన్సిలర్ ఆనందమూర్తి "చూడండమ్మా! ఈ ప్రపంచంలో మంచివాళ్లు చెడ్డవాళ్లు అంటూ మనుషుల్లో రెండు రకాలు అంటూ ఉండవు. అందరూ ఒక్కటే! కాకుంటే ఎదుగుతున్న దశలో పరిస్థితుల ప్రభావం వల్ల విచిత్రమైన మనిషి మనసు కొన్ని పోకడలు పోయి అది, ప్రవర్తనమీద ప్రభావం చూపిస్తుంది. ఆ పరిస్థితులు ఇంట్లోవి కావచ్చు, బయటివి కావచ్చు. ఇది తప్పు..ఇది పొరబాటు అని మనకు కూడా తెలియకుండానే మనం కొన్ని తప్పులు, పొరపాట్లు చేస్తాం! అవి ఎదుటివారి మనసుమీద తీవ్రప్రభావం చూపిస్తాయి. దాని ఫలితమే ఇలాంటి సమస్యలు! మీరేమీ కంగారుపడకండి. ఇది చాలా చిన్న సమస్య! ఈ సమస్యకు మూలం ఎక్కడుందో నేను తెలుసుకోవాలి గనుక మీ పిల్లలిద్దరినీ విడివిడిగా నా దగ్గరకు పంపండి. ఇక్కడికి కాకుండా నేను ఇంకో అడ్రసు ఇస్తాను. అక్కడికి పంపండి. ఏ జాబ్‌కోసమో..పై చదువులకోసమో పర్సనాలిటీ లేక బిహేవియర్ టెస్ట్ కోసం పంపిస్తున్నట్లుగా పంపించండి. నేను కూడా ఏదో ట్రీట్‌మెంట్‌లా కాకుండా చాలా క్యాజువల్‌గా మాట్లాడినట్లు వాళ్లతో మాట్లాడతాను. మీ పిల్లల్ని హర్ట్ చేయడంగానీ ఇన్సల్ట్ చేయడంగానీ ఉండదు. సరేనా! నథింగ్ టు వర్రీ! మీరు మళ్లీ నాలుగు రోజుల తర్వాత పిల్లలు నా దగ్గరికి వచ్చి వెళ్లాక రండి" అంది చెప్పి మరో కేసు అటెండ్ అవ్వటానికి సిద్ధమయ్యాడు ఆనందమూర్తి. తేలికపడ్డ మనసులతో బయటికి వచ్చారు దేవిక, గీతిక.

* * *



# సమంత తెలుగు!

**కొం**తమందికి అదృష్టం భలేగా కలిసొస్తుంటుంది. సమంతకి కూడా అంతే. 'ఏ మాయచేసావే' మరీ అంత బంపర్ హిట్ కాకపోయినా కూడా అందర్నీ 'మాయ' చేసేసిందనే చెప్పాలి. అటు నిర్మాతల దృష్టిలో, ఇటు ప్రేక్షకుల్లోనూ క్రేజ్ సంపాదించుకున్న ఈమె స్వతహాగా తెలుగు అమ్మాయినే నేను అంటోంది. కానీ ఇక్కడ పెరగకపోవడం వల్ల తనకి తెలుగు అంతగా రాదనీ, అయితే బాగా మాట్లాడేందుకు తప్పకుండా కృషి చేస్తానంటోంది. అలా అనకపోతే బాగోదని కాబోలు!

"మిస్ కిన్నెరా! నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. వాటికి సిన్సియర్‌గా నువ్వు సమాధానం చెప్పాలి. ఒకవేళ నువ్వు అబద్ధం చెప్పినా నాకు తెలిసిపోతుంది" కిన్నెర కళ్లల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు ఆనందమూర్తి.

"అబద్ధాలు చెప్పాల్సిన అవసరం నాకు లేదు. ఎందుకంటే మీరు ఇవ్వబోయే ఆ సాఫ్ట్‌వేర్ జాబ్ మీద నాకేమీ ఆసక్తిలేదు" అంది.

"ఎందుకని?"

"మీరు మనుషుల్ని మనుషులుగా చూడరు గనుక! యంత్రంలా మారిపోవటం నాకిష్టంలేదు"

"నువ్వెలా ఉండాలని కోరుకుంటావ్?"

"మనిషిలా స్వేచ్ఛగా, హాయిగా అనుబంధాలను పెంచుకుంటూ..ఆనందాలను పంచుకుంటూ!"

"నువ్వు ఇంతవరకూ జీవితంలో ఒక్క అబద్ధం కూడా ఆడలేదా?" ఇందాక అబద్ధాలు ఆడాల్సిన అవసరం లేదు అన్న కిన్నెర మాటలను ఉద్దేశించి అడిగాడు.

"ఎందుకాడలేదు. ఈమధ్యనయితే మా అమ్మతో రోజూ అబద్ధాలే చెబుతున్నాను" అంది కిన్నెర తక్కున.

ఆ సమాధానానికి అదిరిపడ్డాడు ఆనందమూర్తి! తన పని అంత సులువు అవుతుందని అస్సలు ఆయన అనుకోలేదు.

"ఎందుకు చెబుతున్నారు అబద్ధాలు?" అని అడిగాడు ముందుకు వంగి ఆసక్తిగా.

"మిమ్మల్ని ఎవరయినా ఈ గదిలో బంధిస్తే మీరేం చేస్తారు? రోజుల తరబడి ఇందులో మగ్గుతూనే ఉంటారా? విసుగు, విరక్తి వచ్చాక అయినా ఆ కిటికీ బద్దలు కొట్టో, ఆ వెంటిలేటర్ పీకేసో బయటపడాలని అనుకోరూ!" అంది కిన్నెర ఆవేశంగా.

"నిన్ను మీ ఇంట్లో బంధించి ఉంచుతున్నారా?"

"కాదు ఆంక్షలతో బంధించి ఉంచుతున్నారు. అదుపాజ్ఞలు, నియమాలతో గిరిగీసి అందులోనే ఇరుకు బతుకు బతకమంటున్నారు. అలా చేసి తాము చాలా మంచి తల్లిదండ్రులమని సమాజం చేతనో వారికి వారుగానో అనిపించుకుని, అనుకుని వాళ్లు గర్వపడతారేమోగానీ నాకు అలాంటి లైఫ్ అంటే చిరాకు! నాకేం కావాలో ఏం వద్దో నాకు తెలియదా నేను చిన్నపిల్లనా ఇంకా? నాకు ఇష్టమయిన డ్రస్ వేసుకోవాలని, ఫ్రెండ్స్‌తో కల్సి సరదాగా కూర్చునో, ఫోన్‌లోనో కబుర్లు చెప్పుకోవాలని, ఎప్పుడయినా ఓ సినిమాకు, ఓ పిక్నిక్ వెళ్లాలని నాకు ఉండదా? బయట కాలుపెడితేనే మేము పాడయిపోతామని అంత భయమెందుకు?" ఒక్కొక్క మాటను కచ్చితంగా పలుకుతూ ఫోర్స్‌గా అంటోంది కిన్నెర.

"తల్లిదండ్రులన్న తర్వాత భయం లేకుండా ఎలా వుంటుంది మీ భద్రత విషయంలో? వాళ్లు ఏది చేసినా మీమీద ప్రేమతోనే అని అనుకోవ

చ్ఛగా" అన్నాడు ఆనందమూర్తి కిన్నెర మనసును తరచి చూసే ప్రయత్నంలో భాగంగా.

"అది నిజమే! కానీ దానికీ ఒక లిమిట్ ఉంటుంది కదా సార్! ఎక్కడో ఏవో జరుగుతున్నాయని మీరు భయపడుతూ, మేము కూర్చున్నా, నించున్నా టీవీ పెట్టుకున్నా, కంప్యూటర్ ముందు కూర్చున్నా అదెందుకు ఇదెందుకు అని తరచి ప్రశ్నించటం అలా చెయ్యకు ఇలా చెయ్యకు అని ఆజ్ఞాపించటం ఇదంతా మాకు నిత్య నరకం కాదూ. 'అడుసుతొక్కనేల కాలు కడగనేల' అన్నది కాలం చెల్లిపోయిన సామెత! ఎటు చూసినా సమాజంలో బురదే ఉన్నప్పుడు ఎక్కడో ఒకప్పుడు ఎక్కడో ఒక దగ్గర బురదలో కాలేస్తే మా తప్పు మేం తెలుసుకుని మమ్మల్ని మేం సరిదిద్దుకుంటాం కదా!

ఈరోజుల్లో పిల్లలు ఎన్నేళ్లొచ్చినా అమ్మా, నాన్నల చెయ్యి పట్టుకునే నడవాలని అనుకోవటం లేదు. వాళ్లనోనూ అవేర్‌నెస్ వస్తోంది. అనుభవాల ద్వారా స్వయంగా మంచీ చెడూ తెలుసుకుంటున్నారు. కనుక కాస్తంత స్వేచ్ఛను, ఆటవిడుపును, స్వయం నిర్ణయాధికారాన్ని కోరుకుంటే తప్పేమిటి?

మనిషి జీవితంలో బాల్యం ఒక వరం లాంటిదని మీ పెద్దలే చెబుతారు. ఆ బాల్యాన్ని ఎంజాయ్ చేస్తే కౌమారంలో ప్రతి విషయం పట్లా ఆసక్తిపెంచుకుని దాన్ని నేర్చుకుంటుంటే మా మానాన మమ్మల్ని ఎందుకు వదిలెయ్యరు? 'స్వీట్ సిక్స్‌టీన్' అంటూ యవ్వనారంభ దశ కొత్త కొత్త అనుభూతులకు తలుపులు తెరుస్తుంది అని మీరే సాహిత్యబద్ధం చేసి మరీ చెబుతుంటారు. మాకు మాత్రమే స్వంతమైన మా మనోభావాలను మమ్మల్ని ఆనందించనివ్వకుండా మీరెందుకు మాటిమాటికీ తొంగి చూస్తూ మేం సిగ్గుతో చిన్నబోయేలా చేస్తారు. పెద్దరికం అంటే లాఠీ చేతిలో పెట్టుకుని మా జీవితాలకు పహారా కాయటమేనా?"

అంటూ తడబాటు, బిడియం, మొహమాటం, లేకుండా తీక్షణంగా తన మనసులోని మాటను వ్యక్తం చేస్తున్న కిన్నెరను చూసి పేరుపొందిన సైకాలజిస్ట్ అయిన ఆనందమూర్తికే ఒక పాఠం నేర్చుకున్నట్లుగా అనిపించింది.

తెలిసిన విషయాలు కూడా ఒక్కోసారి మాట్లాడేవాళ్ల నేర్పును, నిజాయితీని బట్టి స్పష్టమైన ఆకృతిని సంతరించుకుని మరింత అవగాహనను కలిగిస్తాయి. అందుకే "నీ ఫ్రాంక్‌నెస్ నాకు చాలా నచ్చిందమ్మా!" అన్నాడు మనస్ఫూర్తిగా మెచ్చుకుంటూ ఆనందమూర్తి.

"నేనే కాదు సార్. ఈ కాలం పిల్లలందరూ ఇలాగే మాట్లాడుతున్నారు. ఎందుకంటే వాళ్లకేం కావాలో వాళ్లకు స్పష్టమైన అవగాహన ఉంది. అమ్మకొంగు పట్టుకుని తిరిగే వయసు దాటాక..లోకం పోకడ, వాస్తవ సమాజం గురించి తెలుసుకునే అవకాశాలు వాళ్లకి ఇప్పుడు ఎక్కువ కావడంతో వయసుని మించి వాళ్ల మెదడు మెచ్యూర్ అవుతోంది. అమ్మానాన్నలు చెప్పేవి వింటూనే వాళ్లకేం కావాలో ఏం వద్దో స్వీయ నిర్ణయాలు తీసుకుంటున్నారు. 'అదిగో బూచి-అటువెళ్లకు' అని పెద్దవాళ్లు దిక్కుదిక్కూ చూపుడువేలుతో చూపించి భయపెడితే భయపడటానికి బదులు 'అదేంటో చూసి దాని పని పడదాం' అని బలంగా, వేగంగా అటే అడుగులు వేసేంత ఆత్మబలంతో ఉన్నారు!"

"శభాష్!"

"మమ్మల్ని మీరు మెచ్చుకోవాలని ఇవన్నీ చెప్పటం లేదు సార్! అర్థం చేసుకోమని అర్థిస్తున్నాను"

"ష్యూర్..అవునుగానీ కిన్నెరా ఇంతటి జీవిత విశ్లేషణ కలిగిన నీవు నీ ఫీలింగ్స్‌ని ఎప్పుడూ ఎవరితో షేర్ చేసుకుంటావో తెల్సుకోవాలని ఉంది!"

"బయట ఉన్నప్పుడు నా క్లోజ్‌ఫ్రెండ్ భావనతో - ఇంట్లో ఉన్నప్పుడు నాకన్నా ఒక్క సంవత్సరమే చిన్న అయిన నా తమ్ముడు కిరీటితో!"

తమ్ముడు కిరీటి ప్రస్థావన రాగానే అలర్ట్ అయ్యాడు ఆనందమూర్తి. తన వలన కావలసిన కార్యం కిన్నెర వల్లనే అవబోతున్నదన్న ఆలోచన రాగానే "నీ తమ్ముడితో నువ్వు చాలా ఫ్రెండ్లీగా ఉంటావన్నమాట!" అన్నాడు.

"ఇంట్లో నాకున్న తోడు వాడొక్కడేకదా!"


## పిల్లల కోసమే

బెంగాలీ భామ సుష్మితా సేన్ ఈసారి దసరా ఉత్సవాలకు తన సొంతూరు కోల్‌కతాకి వెళ్లాలని నిర్ణయించుకుందిట. చాలా కాలంగా తన మాతృగడ్డకి దూరంగా వుంటూ వస్తున్న ఈ 34 ఏళ్ల సుందరి ఈ ఏడాది దసరా సంబరాలను కనులారా చూడాలనుకుంటోందిట. అయితే కేవలం తనకోసమే ఈ పర్యటన కాదుట, తన దత్తపుత్రికలు రెనీ, అలీసాల కోసమే ఈ పండగ టూరు వేస్తున్నానంటోంది. తన దత్తపుత్రికలకు కోల్‌కతాలో దసరా ఉత్సవాలు ఎంత జోరుగా జరుగుతాయో తెలియాలి కదా అంటోంది సుష్.



“అతను కూడా నీలాగే ఆలోచిస్తాడా?”

“ఈకాలం పిల్లలు ఎవరైనా అంతే అని చెప్పానుగా సార్! వాడు మగపిల్లాడు గనుక అమ్మా వాళ్ల భయాలు వేరుగా ఉంటాయి. డబ్బులు ఎక్కువగా ఇస్తే సిగరెట్లు కొనుక్కుని స్మోకింగ్ చేస్తాడేమో అని భయం! ఇంకా డ్రింక్‌కు అలవాటుపడతాడేమోనని..గర్ల్‌ఫ్రెండ్స్‌తో ఎక్కడ తిరుగుతాడోనని వాడి అవసరాలకు కూడా డబ్బులివ్వరు! అందుకే వాడు అస్తమానం ‘అక్కా! నీ దగ్గర డబ్బులేమయినా ఉంటే ఇవ్వు! ప్లీజ్!’ అని అడుగుతాడు. నా ఖర్చులు కొన్ని తగ్గించుకుని..ఉన్నప్పుడు ఇస్తాను. వాడి కోసమయినా ఏదయినా పార్ట్ టైమ్ జాబ్ చేసి సంపాదించాలని అనిపిస్తుంది నాకు. అప్పుడప్పుడయినా సరదాకి. వాడికీ ఫ్రెండ్స్, సినిమాలు, షికార్లు ఖర్చులు ఉంటాయని అమ్మావాళ్లు ఎందుకు తెలుసుకోరో అర్థం కాదు. వాళ్లకు తెలిసింది ఒక్కటే. డిసిప్లిన్! అదే జీవనమంత్రం అనుకుంటారు. ఎంత పిల్లలమయినా స్వేచ్ఛలేని జీవితం మాకూ ఊపిరాడనివ్వదని ఈ పెద్దలకు ఎప్పుడర్థమవుతుందో” అని కిన్నెర అంది.




ఆ తర్వాత ఉన్నట్టుండి లేచి “ఇంక నేను వెళ్లొచ్చా సార్! మీ ఇంటర్వ్యూ అయినట్టేనా?” అంది.

మెచ్చుకోలుగా తన వంక మరోసారి చూసి ‘వెళ్లొచ్చు..’ అన్నట్లుగా తల ఊపగానే లేచి..నాలుగడుగులేసి మళ్లీ వెనక్కు తిరిగి “మా అమ్మకు నేను అందించాల్సిన నా ఫీలింగ్స్‌కి మీరు వారధి కాబోతున్నందుకు చాలా థాంక్స్ సార్! డైరెక్ట్‌గా అమ్మతో మాట్లాడి ఉంటే ఇంత స్పష్టంగా, కచ్చితంగా నా భావాలను అందించి ఉండేదాన్ని కాదేమో!” అంది కిన్నెర నవ్వుతూ.

ఆ మాటలకు అదిరిపడ్డాడు ఆనందమూర్తి..‘గడుసుపిల్ల’ అనుకున్నాడు మనసులోనే.


★ ★ ★

తన ఎదురుగా కూర్చుని ఉన్న కిన్నెర కిరీటిల తల్లి దేవిక-పిన్ని గీతికలను షార్ప్‌గా చూస్తూ అన్నాడు కౌన్సిలర్ ఆనందమూర్తి.

“మీ అమ్మాయి కిన్నెరతో మాట్లాడాను. తనతో మాట్లాడాక ఇంక మీ అబ్బాయితో మాట్లాడాల్సిన అవసరం లేదనిపించింది. ఇద్దరి ప్రోబ్లమ్స్ ఒకటే!” అని ఒక్క క్షణం ఆగి “ఆ ప్రోబ్లమ్ మీరే! మీరు మీవారు!” అన్నాడు టక్కున.

ఆ మాటలతో అవాక్కయింది దేవిక. చెల్లెలి వంక అయోమయంగా చూసింది ఆ తర్వాత.

“పిల్లల్ని స్ట్రిక్ట్‌గా పెంచాలి నిజమే కానీ మరీ ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యేంతగా కాదు. సమస్యలు పెద్దవాళ్లయిన మనకే వుంటాయని పొరబడుతూ వుండటం వల్లే ఈ జనరేషన్ గ్యాప్ వస్తోంది పిల్లలకూ సమస్యలుంటాయి. వాళ్లకూ జీవితం మీద ఆశలు, ఆశయాలు, కోర్కెలు, అవి తీర్చుకోవటానికి డబ్బు అవసరాలు ఉంటాయి. లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యాల్సిన వయసు వాళ్లది. హాయిగా, స్వేచ్ఛగా రెక్కలల్లార్చుతూ విహరించాలని ఉంటుంది. అలాంటి సమయంలో అర్థం లేని భయాలతో వాళ్లని పంజరంలో పక్షుల్లా బంధించి మన కళ్లముందు ఉంచుకోవాలని అనుకుంటాం మనం! అక్కడే పెద్దలమయిన మనం తప్పుచేస్తున్నాం దేవికగారూ! మీ పిల్లలు పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్! వాళ్లని నమ్మండి. అనుమానించి అవమానించకండి! వాళ్లని పంజరంలో పక్షుల్లా నిర్బంధించి ఉంచకండి. ఆడుతూ, పాడుతూనే అన్నీ నేర్చుకుంటూ ఎదిగేలా పెంచండి. వాళ్లని స్వేచ్ఛగా అలా అలా కాసేపు విహరించనిస్తే తిరిగి తిరిగి మళ్లీ మీ గూటికే వచ్చివాలి మీకు కనువిందు చేస్తారు” అని ఆనందమూర్తి అనగానే దేవికకు ఓ కొత్త జీవితం బోధపడ్డట్టు అయింది.



## లక్కీ చాన్స్

***జెనీలియాకి బాలీవుడ్‌లో అవకాశాలు వస్తున్నట్టే వస్తూ కొన్ని చేజారుతున్నాయి. దాంతో నిరాశలో వున్న ఆమెకి కాస్త ఉత్సాహం కలిగించే ఆఫర్ ఒకటి వచ్చిందిట తాజాగా. దాదాపు ఇరవైయ్యేళ్ల క్రితం వచ్చిన అమితాబ్ సినిమా ‘అగ్నిపథ్’ని హృతిక్‌తో రీమేక్ చేయాలనుకుంటున్నాడుట కరణ్‌జోహార్. ఇందులో హృతిక్‌కి జంటగా జెనీలియాని తీసుకోవాలని భావిస్తున్నాడట. ఇదే గనక నిజమైతే జెనీలియాకి మంచి సినిమా చిక్కినట్టే. మరి ఆమె అదృష్టం ఎలా వుందో!***